సాక్షి
విజయనగరం
మంగళవారం । 12 । డిసెంబర్ । 2023



సిరి 'వరి'ంచాలంటే..

వరి కోత, నూర్పిడి, ఆరబెట్టడంలో చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకుంటే మద్దతు ధర లభిస్తుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. - 8లో



అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా జట్టు పయనం - 8లో

రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ బాల, బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్టు సోమవారం పయనమైంది.



జగనన్నకు చెబుదాంకు 198 వినతులు - 8లో

విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాంకు 198 వినతులు అందాయి.

న్యూస్‌రీల్

59 మందికి 'లా నేస్తం'



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ మయూర్ అశోక్, యువన్యాయవాదులు

విజయనగరం అర్బన్: జిల్లాలోని 59 మంది యువ న్యాయవాదులకు 'వైఎస్సార్ లా నేస్తం' విడుదలైంది. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సోమవారం బటన్‌నొక్కి లా నేస్తం నిధులను న్యాయవాదుల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి జేసీ మయూర్ అశోక్, సెక్షన్ సూపరింటెండెంట్ గొట్లాపు రాము, యువ న్యాయవాదులు తిలకించారు. అనంతరం నమూనా చెక్కును యువన్యాయవాదులకు జేసీ అందజేశారు. ఒక్కొక్కరికి నెలకు రూ.5 వేలు చొప్పున ఆరు నెలలకు రూ.30 వేల ఆర్థిక లబ్ధి కల్పించారు. ఈ ఏడాది జూలై, ఆగస్టు నెలలకు 59 మందికి, సెప్టెంబర్ నెలకు 57 మందికి, అక్టోబర్ నెలకు 58 మందికి, నవంబర్ నెలకు 57 మందికి విడుదల చేశారు. 59 మందిలో బీసీలు 39 మంది, ఓసీలు 9, ఎస్సీలు 10మంది, ఎస్టీ ఒక్కరు ఉన్నారు.

13న ఎస్ఆర్ పోస్టులకు ఇంటర్వ్యూ

విజయనగరం ఫోర్ట్: సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి ఈ నెల 13వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహిస్తామని ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాజులరేగ సమీపంలోని ట్రైబల్ యూనివర్సిటీ ఎదురుగా ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉదయం 10 గంటలకు జరిగే రిక్రూట్మెంట్‌కు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తుతో పాటు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లను తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వైబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

వృత్తిపట్ల అంకిత భావంతో పనిచేయాలి

- డీఎంహెచ్ఓ భాస్కరరావు



వైద్యాధికారులుగా ఎంపికైన వారితో డీఎంహెచ్ఓ

విజయనగరం ఫోర్ట్: వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పట్టణ పీహెచ్‌సీలు, ఎన్ఆర్‌సీలలో ఖాళీగా ఉన్న వైద్యాధికారుల పోస్టుల భర్తీకి సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. 9 మందికి నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వరావు, కార్యాలయ సూపరింటెండెంట్ నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటిస్‌తో నైపుణ్యం పెంచుకోవాలి

విజయనగరం అర్బన్: అప్రెంటిస్ షిప్‌తో ఐటీఐ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్, అప్రెంటిస్ అధికారి టి.వి.గిరి అన్నారు. ఐటీఐ అభ్యర్థుల కోసం స్థానిక ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో ఆరు ప్రైవేటు సంస్థలు సోమవారం నిర్వహించిన అప్రెంటిస్ ఎంపిక ప్రక్రియకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు సంస్థలో ఉద్యోగాల సాధించాలంటే విద్యార్హతతో పాటు సంబంధిత సాంకేతిక విద్యలో నైపుణ్యం, సృజనాత్మకత పెంచుకోవాలన్నారు. అప్రెంటిస్ షిప్‌కోసం 125 మందిని ప్రైవేటు సంస్థలు ఎంపిక చేశాయని తెలిపారు.


వ్యాక్సినేషన్ డ్రైవ్ ప్రారంభం

విజయనగరం అర్బన్: మిషన్ ఇంద్రధనుష్ కింద ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాక్సినేషన్ డ్రైవ్ జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైంది. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం అనంతరం అధికారులతో జేసీ కె.మయూర్ అశోక్ మాట్లాడారు. ఐదేళ్లలోపు పిల్లలకు న్యుమోనియా, పోలియో, బీసీజీ, హెపటైటిస్-బి, రోటావైరస్ నిరోధక వాక్సిన్లు వేయాలని సూచించారు. ఈ నెల 16వ తేదీ వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. గర్భిణులకు టీటానాస్ వ్యాక్సిన్ కూడా వేయించాలన్నారు. జిల్లాలో ఈ నెల 27 నుంచి జనవరి 12 వరకు లెప్రసీ కేసుల గుర్తింపు కార్యక్రమం జరుగుతుందని జేసీ తెలిపారు. శరీరంపై ఎక్కడైనా స్పర్శలేని మచ్చలు ఉంటే ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి వైద్యుడికి చూపించేలా ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ గౌరీశంకరరావు, డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, లెప్రసీ వైద్యులు డాక్టర్ కె.రాణి, తదితరులు పాల్గొన్నారు.

కర్రోతు కనికట్టు!

అయన టీడీపీ మండలస్థాయి నాయకుడు. రెండు దశాబ్దాల కిందట ఆ ప్రాంతంలో అయన చెప్పినిదే వేదం. చేసినిదే శాసనం. అదే బలంతో రెవెన్యూ వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకున్నారు. అక్రమాలకు తెరతీశారు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు రికార్డులు మార్చేసి తన ఖాతాలో వేసుకున్నారు. రూ.కోట్ల విలువైన స్థలాలను కొనుగోలుచేసినట్టుగా తన పేరుపై మార్చుకున్నారు. ప్రస్తుత పోలీస్, రెవెన్యూ అధికారుల విచారణలో ఆయన భూ బాగోతం ఒక్కొక్కటిగా వెలుగుచూస్తోంది.

- నెల్లిమర్ల టీడీపీ నాయకుడి భూ అక్రమ లీలలు
- కోట్ల విలువైన భూమికి నకిలీ పట్టాలతో ఎసరు
- రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సిబ్బందితో కుమ్మక్కు!
- కర్రోతు సత్యనారాయణ కోరినట్టుగా సాఫీగా వ్యవహారం



నకిలీ పట్టాల సృష్టి...

భోగాపురం మండలం పోలిపల్లికి చెందిన రాలి నరసింగరావు, లింగాలవలస గ్రామానికి చెందిన ఓదూరి అప్పయ్య అనే వ్యక్తులకు మాజీ సైనికుల కోటాలో భూమిని కేటాయించినట్టు పట్టాలు సృష్టించారు. ఆ పట్టాలను పోలిపల్లి రెవెన్యూ పరిధిలోకి బదలాయించి సర్వే నంబర్ 27లో భూమి కేటాయించినట్టుగా మంత్రాంగం నడిపారు. ఆ ప్రకారం ఓదూరి అప్పయ్యకు కేటాయించిన 1.52 ఎకరాలు, రాలి నరసింగరావుకు కేటాయించిన 1.50 ఎకరాలు మొత్తంగా సర్వే నంబర్లు 27/1, 27/2లోని 3.02 ఎకరాలను కొనుగోలు చేసినట్టు చూపించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఏదైనా స్థిరాస్తి కొనుగోలు చేసిన తర్వాత తహసీల్దార్ కార్యాలయంలోని ఎఫ్‌సీఓలో మార్పు చేయడం సాధారణం. కానీ నెల్లిమర్ల టీడీపీ నాయకుడు, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బంగార్రాజు సోదరుడైన కర్రోతు సత్యనారాయణ మాత్రం అందుకు అతీతం. ఆరేళ్ల తర్వాత ఒక భూమిని ఆయన కొంటారని తెలుసుకొని రెవెన్యూ అధికారులు ముందే ఎఫ్‌సీఓలో దిద్దుబాటు చేసి అట్టేపెట్టారు! భోగాపురం మండలంలోని పోలిపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న రూ.కోట్ల విలువైన 3.02 ఎకరాల భూమిని నకిలీ పట్టాలతో కొనుగోలు ముసుగులో కబ్జా చేయాలనే కర్రోతు సత్యనారాయణ విజన్‌కు నాటి రెవెన్యూ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల సిబ్బంది ఎంతగా సహకారం అందించారో దీనినిబట్టి అర్థమవుతుంది. కర్రోతు కనికట్టు ఎలా ఉంటుందో చెప్పడానికి పోలీస్ విచారణలో భోగాపురం ప్రస్తుత తహసీల్దార్ ఇచ్చిన నివేదిక చూస్తే చాలు.

భోగాపురం మండలం పోలిపల్లి రెవెన్యూ పరిధిలో జాతీయ రహదారి విస్తరణకు 2000-01లో తిరుమారెడ్డి ఆదినారాయణ వారసులకు అందాల్సిన సుమారు రూ.18 లక్షల పరిహారాన్ని కర్రోతు సత్యనారాయణ ఎలా దక్కించుకున్నారో 'సాక్షి' ఇప్పటికే వెలుగులోకి తీసుకొచ్చింది. సర్వే నంబర్లు 27/1, 27/2, 27/4 (కొంత భాగం)లో వెరసి 1.74 ఎకరాలకు అందిన పరిహారాన్ని గుట్టుచప్పుడు గాకుండా గుటకాయ స్వాహా చేసిన కర్రోతు... ఆ తర్వాత పక్కనే జాతీయ రహదారిని ఆనుకొని తిరుమారెడ్డి ఆదినారాయణ వారసుకులకు మిగిలిన 3.02 ఎకరాల భూమినీ తన ఖాతాలో చేర్చుకోవడానికి అప్పటినుంచే పావులు కదిపారు.

అంతా తికమక...

మాజీ సైనికోద్యోగుల కోటాలో రాలి నరసింగరావుకు, ఓదూరు అప్పయ్యకు ఎక్కడో కేటాయించిన భూమికి బదులుగా పోలిపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్లు 27/1, 27/2లోని భూమి బదలాయిస్తున్నట్టుగా ఎఫ్‌సీఓలో భోగాపురం ఎమ్మార్వో 2006 నవంబర్ నెలలో నమోదు చేశారు. కానీ ఈ బదలాయింపునకు ఆర్నెళ్ల ముందే అంటే 2006 జూన్‌లో కర్రోతు సత్యనారాయణ అవే సర్వే నంబర్లలోని భూమిని రాలి నరసింగరావు, ఓదూరు అప్పయ్య నుంచి కొనుగోలు చేసినట్టు చూపించి రిజిస్ట్రేషన్ చేయించుకోవడం గమనార్హం. అంతేగాకుండా ఈ రెండు సర్వే నంబర్లలోని భూమి స్వభావం బంజరు భూమి అని దిద్దుబాటు చేశారు. అలా దిద్దుబాటు చేసినప్పటికీ అదే ఎఫ్‌సీఓలో పుంజ అని ఉంది. రిమార్క్స్‌లో బంజరు అని రాయడం గమనార్హం.

సేల్ డీడ్‌లోనూ గమ్మత్తు...

రాలి నరసింగరావు, ఓదూరు అప్పయ్య తమ భూమిని కర్రోతు సత్యనారాయణకు విక్రయిస్తూ రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చిన సేల్‌డీడ్‌లోనూ గమ్మత్తు ఉంది. ఆ భూమి పూర్తిగా జిరాయితీ అని, ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూమి కాదని ఒక పేరాలో పేర్కొన్నారు. డిక్లరేషన్‌లో మాత్రం మాజీ సైనికుల కోటాలో పొందిన ఆ భూమి విక్రయానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదంటూ భోగాపురం ఎమ్మార్వో ఎన్ఓసీ ఇచ్చారని తెలిపారు. ఒకే డాక్యుమెంట్లో భిన్నమైన వాదనలు ఉన్నప్పటికీ, ఎన్ఓసీ జతచేయనప్పటికీ భోగాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు కళ్లు మూసుకొని 2006 జూన్ 7వ తేదీన రిజిస్ట్రేషన్ చేసేశారు.



పోలిపల్లిలో కర్రోతు సత్యనారాయణ కొనుగోలు చేసినట్టు చూపిస్తున్న భూమి ఇదే

అక్రమని తెలిసే సహకారం

మాజీ సైనికులకు కేటాయించిన భూమిని నిర్ణీతకాలం తర్వాత వారు వేరెవ్వరికైనా విక్రయించాలంటే ఎన్ఓసీ తీసుకోవాలి. అది ఇచ్చే అధికారం జిల్లా కలెక్టర్‌కు మాత్రమే ఉంటుంది. కానీ భోగాపురం తహసీల్దార్ ఎన్ఓసీ ఇచ్చారన్న కర్రోతు సత్యనారాయణ వాదనను మాత్రమే పరిగణనలోకి తీసుకొని భోగాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయడం గమనార్హం. కొసమెరుపు ఏమిటంటే... జిరాయితీ భూమిగా చూపించి 2000-01లో ఎన్‌హెచ్ఏఐ నుంచి కర్రోతు సత్యనారాయణ పరిహారం తీసుకున్న సర్వే నంబర్ 27 భూమిలోకే మాజీ సైనికుల పట్టాలను బదలాయిస్తూ 2006 నవంబర్‌లో ఎమ్మార్వో ఎఫ్ఓసీలో దిద్దుబాటు చేయడం గమనార్హం. నిబంధనల ప్రకారం జిరాయితీ భూమిలో రెవెన్యూ అధికారులు పట్టాలు ఇవ్వకూడదు. ఒకవేళ అది బంజరు భూమి అయితే దాన్ని జిరాయితీగా చూపించి ఎన్‌హెచ్ఏఐ నుంచి పరిహారం పొందడం కర్రోతు సత్యనారాయణ చేసిన నేరమే అవుతుంది. అంతేకాదు సర్వే నంబర్లు 27/1, 27/2లో తాను 2006లో కొనాలనుకున్న భూమికి అంతకు ఆరేళ్ల ముందే అంటే 2000 సంవత్సరంలోనే ఆయన పేరుతో ఎఫ్‌సీఓలో రికార్డు చేయించి పెట్టుకోవడం మరో విశేషం. ఇలా కొనుగోలుకు ముందుగానే ఎఫ్‌సీఓలో దిద్దుబాటు చేయించుకోవడం బహుశా కర్రోతు కనికట్టుతోనే సాధ్యమైందని చెప్పాలి.

తహసీల్దార్ నివేదికతో వెలుగులోకి...

ఈ వ్యవహారంపై పోలీసు దర్యాపులో భాగంగా భోగాపురం తహసీల్దార్ ఈ ఏడాది ఆగస్టు 31న సమర్పించిన నివేదికతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. రాలి నరసింగరావుకు, ఓదూరు అప్పయ్యకు మాజీ సైనికుల కోటాలో పట్టాలు ఇచ్చినట్లు కానీ, సంబంధిత భూమి విక్రయించుకోవడానికి ఎమ్మార్వో ఎన్ఓసీ ఇచ్చినట్లుగా కానీ తమ వద్దనున్న రికార్డుల ప్రకారం ఎలాంటి ఆధారాలు లభ్యంలోలేవని తహసీల్దారు స్పష్టం చేయడం గమనార్హం.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- వైఎస్సార్ రైతు భరోసాతో ఠంచన్‌గా పెట్టుబడి సాయం
- ఆర్‌బీకేల ద్వారా సత్వర సేవలు
- టీడీపీ హయాంలో విత్తనాలకూ లాఠీ దెబ్బలు తినాల్సిన పరిస్థితి
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



జామిలో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

జామి: రైతు సంక్షేమమే లక్ష్యంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలన సాగిస్తోందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. జామిలో ఓ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుతో కలిసి సోమవారం హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. ఊరూరా ఏర్పాటుచేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనం నుంచి పంట కొనుగోలు వరకు రైతులకు ప్రభుత్వం సేవలందిస్తోందని, పంటలకు మద్దతు ధర కల్పిస్తోందని తెలిపారు. ఏటా వైఎస్సార్ రైతు భరోసా కింద ఠంచన్‌గా రూ.13,500 పెట్టుబడి సాయం అందిస్తోందని, విపత్తుల సమయంలో తక్షణమే పరిహారం అందజేస్తోందని, రాయితీపై విత్తనాలు సమకూర్చుతోందని చెప్పారు. గత టీడీపీ హయాంలో విత్తనాలు కావాలంటే మండల కేంద్రాల్లో క్యూ కట్టాల్సి వచ్చేదని, కొన్నిసార్లు లాఠీదెబ్బలు తినాల్సి వచ్చేదన్నారు. రైతు అంటే చంద్రబాబుకు ఎప్పుడూ చిన్నచూపేనని విమర్శించారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని చూసి ఓర్వలేక టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి కళావెంకటరావు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎన్నికల వేళ టీడీపీ నాయకులకు రైతులు గుర్తుకొచ్చారన్నారు. టీడీపీ హయాంలో రైతులకు చేసిన మేలును చెప్పకుండా ఉత్తుత్తి ఆరోపణల చేయడం విచారకరమన్నారు. రైతులకు 9 గంటల పాటు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నది ఎవరో తెలిసి మాట్లాడాలని హితవుపలికారు.

తోటపల్లి ప్రాజెక్టు ఆధునికీకరణ పనులతో సాగువిస్తీర్ణం పెరిగిన విషయం వ్యవసాయ అధికారులను అడిగితే చెబుతారన్నారు. గతంలో విపత్తుల సమయంలో రైతులను పట్టించుకోని వారు ఇప్పుడు మాట్లాడడం 'దెయ్యాలు వేదాలు వల్లివేస్తున్నట్టు' ఉందని ఎద్దేవా చేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సరయు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.రవికుమార్, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, సూర్యనారయణరాజు, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ సీహెచ్ సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ నష్ట గణనకు మార్గదర్శకాలు



మయూర్ అశోక్, జేసీ

విజయనగరం అర్బన్: ఇటీవల సంభవించిన మిచాంగ్ తుఫాన్ కారణంగా కురిసిన వరదలు/భారీ వర్షాల వల్ల పంటలు మునిగిపోవడం వల్ల నష్టం జిల్లాలో అంచనా వేయడానికి మార్గదర్శకాలను జేసీ కె.మయూర్ అశోక్ సోమవారం విడుదల చేశారు. ఈ మార్గదర్శకాలను జిల్లా అధికారులకు జారీ చేశారు.

- దెబ్బతిన్న పంట విస్తీర్ణం 33 శాతం కంటే ఎక్కువ దిగుబడి నష్టం కలిగి ఉండాలి. దానికి మాత్రమే ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరవుతుంది.
- కొత్త పంట వేసుకునే అవకాశం ఉన్నప్పుడు (అపరాలు, మొక్కజొన్న వంటి పంటలకు) పెట్టుబడి రాయితీ కాకుండా రాయితీపై కొత్త విత్తనాలు ఇస్తారు.
- పంటనష్టం గణనకు గ్రామం/మండలం/డివిజన్ స్థాయి బృందాలను కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయం, రెవెన్యూ శాఖల అధికారులతో ఏర్పాటు చేస్తాం.
- ఈ-క్రాప్‌లో నమోదైన వాస్తవ సాగుదారుకు మాత్రమే పంట నష్టం గణన చేయాలి.
- ఈ నెల 18వ తేదీ లోగా పంట నష్టం గణన పూర్తి చేయాలి. ఈ జాబితాను రైతుల సామాజిక తనిఖీ కోసం ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు ఆర్‌బీకేల్లో ప్రదర్శించాలి.
- జాబితాపై ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా పరిష్కరించి తర్వాత ఇన్‌పుట్ సబ్సిడీపై ప్రతిపాదనలు నివేదించాలి.
- 26వ తేదీ నాటికి కలెక్టర్ ద్వారా తుది జాబితాను రాష్ట్ర కార్యాలయానికి సమర్పిస్తారు.
- ఒక పంట కాలంలో అన్ని పంటల మొత్తం విస్తీర్ణం ఒక్కో రైతుకు రెండు హెక్టార్ల కంటే ఎక్కువ కాకుండా పంటనష్ట పరిహారం ఇస్తారు.
- రైతు వివిధ ప్రదేశాలలో సాగు చేస్తూ, జాబితాలో ఒకటి కంటే ఎక్కువసార్లు నష్టం కలిగి ఉంటే ఒక్కో రైతుకు 2.0 హెక్టార్ల కంటే ఎక్కువ ఉండకూడదు.
- నివేదించిన, దెబ్బతిన్న విస్తీర్ణం ఏదైనా పంటల కోసం విత్తన విస్తీర్ణం (ఈ-పంట) కంటే ఎక్కువ ఉండకూడదు.

నీరు-చెట్టు పనులపై విచారణ



మాట్లాడుతున్న ఎస్ఈ రాజరాజేశ్వరి

బొబ్బిలి: గత ప్రభుత్వ హయాంలో జరిగిన నీరు-చెట్టు పనులపై వివిధ శాఖల ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోందని బొబ్బిలి ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ వై.వి.రాజరాజేశ్వరి తెలిపారు. స్థానిక విలేకరులతో ఆమె సోమవారం మాట్లాడారు. పనులపై విచారణ కొనసాగుతుండగానే పలువురు కోర్టుకెళ్తున్నారన్నారు. రూ.2.78 కోట్ల విలువైన 25 పనులపై 13 రిట్ పిటిషన్లు, రూ.3.50 కోట్ల విలువైన 40 పనులపై మరో 25 కేసులు కోర్టులో ఉన్నట్టు వెల్లడించారు. విజిలెన్స్ అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులు కూడా దర్యాప్తు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. జైకా పనులు కొన్నింటి బిల్లులు చెల్లించగా మరికొన్ని చెల్లించాల్సి ఉందన్నారు. జంఝావతి రెండు ప్యాకేజీ పనుల్లో మొదటి ప్యాకేజీ పూర్తయిందని, రెండో ప్యాకేజీ పనులు కొనసాగుతున్నాయన్నారు. నాలుగేళ్ల కిందట మంజూరైన సామాజిక చెరువుల పనులు 5 ప్యాకేజీల్లో రూ.9.25 కోట్లు మంజూరు కాగా రెండు, మూడు ప్యాకేజీల్లోని పనులే నెమ్మదిగా జరుగుతున్నాయని, మిగిలిన పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రభుత్వానికి తెలియజేస్తామని చెప్పారు.

● గణారాధన



వల్లంపూడి సాంబమూర్తి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన గణారాధనలో పాల్గొన్న భక్తులు

వేపాడ మండలంలోని వల్లంపూడి సాంబమూర్తి ఆలయ ప్రాంగణంలో సోమవారం రాత్రి గణారాధన వైభవంగా నిర్వహించారు. అర్చకులు శంకరశర్మ, పవన్ శర్మలు ఉదయం నుంచి శివాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. రాత్రి నిర్వహించిన గణారాధనలో వేపాడ-వల్లంపూడి జంటగ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. కాగడాలను వెలిగించి హరినామస్మరణ, శివనామ స్మరణలో తరించారు. అన్నప్రసాదాన్ని స్వీకరించారు. - వేపాడ

పీఐబీ ఏడీజే రాక నేడు

విజయనగరం అర్బన్: కేంద్ర ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖలోని పత్రికా సమాచార బ్యూరో (పీఐబీ) అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ ధీరజ్ కకాడియా విజయనగరం జిల్లాలో మంగళవారం పర్యటించనున్నారు. గంట్యాడ మండలం తాటిపూడి, డెంకాడ మండలం డి.తాళ్లవలసలో నిర్వహించే వికసిత్‌భారత్ సంకల్ప యాత్రను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని సీబీసీ నోడల్ అధికారి బి.తారకప్రసాద్ సోమవారం తెలిపారు.

నాటకానికి ప్రామాణికం 'కన్యాశుల్కం'

- గురజాడ స్వగృహాన్ని సందర్శించిన సినీనటుడు, రచయిత ఎల్.బి.శ్రీరామ్



మహాకవి గురజాడ స్వగృహంలో ఎల్.బి.శ్రీరామ్‌ను సత్కరిస్తున్న గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: మహాకవి రచించిన కన్యాశుల్కమనేది నాటకానికి ప్రామాణికమని సినీ నటుడు, రచయిత ఎల్.బి.శ్రీరామ్ పేర్కొన్నారు. విజయనగరంలోని గురజాడ స్వగృహాన్ని ఆయన సోమవారం సందర్శించారు. గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మేడపైన ఉన్న మహాకవి వాడిన కళ్లద్దాలు, పుస్తకాలు చూసి తన్మయత్వం చెందారు. విజిటర్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్యనటుడిగా హాస్యరసాన్ని పండిస్తున్నామంటే కన్యాశుల్కం నాటకాన్ని బేస్‌గా తీసుకుని చేస్తున్నామని గుర్తుచేశారు. గతంలో ఓసారి రాత్రి సమయంలో వచ్చినప్పుడు గురజాడ ఇల్లు మూసివేసి ఉందని, అప్పుడు చూడలేకపోయానని, విశాఖలో గొల్లపూడి మారుతీరావు పేరుతో తనకు మంగళవారం అవార్డు ఇస్తున్నారని, అందుకు ముందుగానే విజయనగరం చేరుకుని మహాకవి ఇంటిని దర్శించుకోగలిగానన్నారు. ఈ సందర్భంగా గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఆయనను దుశ్శాలువతో సత్కరించి, కన్యాశుల్కం పుస్తకాన్ని అందజేశారు. కార్యక్రమంలో గురజాడ మునిమనవడు గురజాడ వెంకటేశ్వరప్రసాద్, ఇందిర దంపతులు, సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్, సభ్యులు భోగరాజు సూర్యలక్ష్మి, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు ప్రారంభం

- అండర్-14, 17, 19 విభాగాల్లో 960 మంది క్రీడాకారులు హాజరు
- పోటీలను ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: విజయనగరం జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడామైదానంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి సోమవారం ప్రారంభించారు. రాష్ట్ర స్థాయిలో అండర్-14, 17, 19 విభాగాల్లో జరుగుతున్న స్కూల్ గేమ్స్ పోటీలకు వివిధ జిల్లాలకు చెందిన 960 మంది బాల, బాలికలు హాజరయ్యారు. నాకౌట్ పద్ధతిలో నిర్వహించే పోటీల్లో మొదటి రోజు అండర్-14, 17 విభాగాల క్రీడాకారులు తలపడ్డారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపికచేస్తామని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్.వి.రమణ తెలిపారు. పోటీలు మంగళ, బుధవారాలు జరుగుతాయని పేర్కొన్నారు.



రింగ్‌లో తలపడుతున్న క్రీడాకారులు



బాక్సింగ్ పోటీలకు హాజరైన వివిధ జిల్లాల క్రీడాకారులు

క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు: కోలగట్ల

క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని, ప్రభుత్వం వివిధి ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. బాక్సింగ్ పోటీలను ప్రారంభించిన అనంతరం క్రీడాకారులతో కాసేపు ముచ్చటించారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం క్రీడారంగాన్ని ప్రోత్సహిస్తోందని, అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. బాక్సింగ్ అంటే తనకు ఎంతో మక్కువని చెప్పారు. తన 20వ ఏట బాక్సింగ్‌లో తర్ఫీదు పొంది 1980లో స్వచ్ఛందంగా బాక్సింగ్ పోటీలను నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోల మన్మథకుమార్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మూడుకు చేరిన మృతుల సంఖ్య



మృతిచెందిన చిన్నారి లాస్య

లక్కవరపుకోట: మండల కేంద్రం లక్కవరపుకోటలోని గవర వీధిలో గ్యాస్ లీకై ఇల్లు పేలిపోయిన ఘటనలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. గత నెల 19వ తేదీన గ్యాస్ లీకై ఇల్లు పేలిపోయిన ఘటనలో ఇద్దరు మహిళలు, ముగ్గురు చిన్నారులు తీవ్రంగా కాలిపోయిన విషయం విదితమే.ఈ ప్రమాదంలో తీవ్రంగా కాలిపోయిన కె.లాస్య(8) విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఏఎస్సై టి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన తామరాపల్లి వెంకటలక్ష్మి(50) గత నెల 29న, మరో మహిళ కె.శ్రావణి(30) ఈ నెల 7న మృతిచెందారు. వీరంతా ఒకే కుంటుంబానికి చెందిన వారు.ఈ ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరు చిన్నారులు ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారని, వారి పరిస్థితికూడా విషమంగా ఉన్నట్లు పోలీసులు చెప్పారు.

లారీ ఢీకొని మహిళ మృతి



పోలమ్మ మృతదేహం

పార్వతీపురం టౌన్: మండలంలోని అడ్డాపుశీల గ్రామ సమీపంలో సోమవారం లారీ ఢీకొని ఓ మహిళ మృతిచెందింది. ఈ ప్రమాదంపై రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలం సింగనాపురం గ్రామానికి చెందిన పోలమ్మ(39)భర్తతో కలిసి పార్వతీపురం మండలంలోని అడ్డాపుశీల కాశీ విశ్వేశ్వరుని దర్శించుకుని తిరిగి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ అడ్డాపుశీల గ్రామ సమీపంలో ఢీకొంది. దీంతో గాయపడిన ఆమెను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ జయరావు తెలిపారు.

నర్సిపురం ఆలయంలో హుండీ చోరీ



ఆలయంలో చోరీకి గురైన హుండీ

పార్వతీపురంటౌన్: మండలంలోని నర్సిపురం రైల్వేస్టేషన్ సమీపంలో గల కాశీవిశ్వేశ్వరుని ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండలు హుండీ పగల గొట్టి చోరీకి పాల్పడ్డారు. సోమవారం ఉదయం ఆలయ అర్చకుడు తలుపులు తెరచి చూసేసరికి హుండీ తాళం పగుల గొట్టి ఉండడం గమనించి కమిటీ సభ్యులకు తెలిపారు. తక్షణమే వారు పోలీసు సిబ్బందికి సమాచారాన్ని అందజేయడంతో పోలీసులు ఆలయానికి వచ్చి దర్యాప్తు చేశారు. ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాలను పరిశీలించి దుండగులను పట్టుకుంటామని రూరల్ ఎస్సై దినకర్ తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

పార్వతీపురం టౌన్: ఈ నెల 12న పార్వతీపురం ఆర్టీసీ డిపో పరిధిలో గల సమస్యలపై డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కనక దుర్గ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ పరిధిలో గల సమస్యలను మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఫోన్ 9959225621 నంబర్‌కు కాల్ చేసి తెలపవచ్చని పేర్కొన్నారు.

చెట్ల నరికివేతపై అటవీ శాఖాధికారుల పరిశీలన



ఎస్.కోట: నరికిన చెట్లు, దుంగలకు కొలతలు వేస్తున్న అటవీశాఖాధికారులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అనుమతి లేకుండా నరికివేతకు గురైన చెట్లను అటవీ శాఖాధికారులు సోమవారం పరిశీలించారు. కళాశాల ప్రాంగణంలో అనుమతుల్లేకుండా టేకు,తురాయి, కాగు చెట్లు తొలగించడంపై వచ్చిన ఫిర్యాదుమేరకు అటవీశాఖాధికారి రవి కుమార్ నరికివేతకు గురైన చెట్లు, దుంగలను పరిశీలించి కొలతలు తీసుకున్నారు. అనుమతుల్లేకుండా నరికివేతకు గురైన చెట్లు కొలతలను బట్టి ఉన్నతాధికారులు జరిమానా విధించనున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు వద్ద చెట్ల నరికివేతపై ప్రస్తావించగా 22, 23 తేదీల్లో న్యాక్ టీమ్ సందర్శన ఉన్నందున నేలను సమాంతరం చేసేందుకు చెట్లు తొలగించామని ముందస్తు అనుమతి తీసుకోవాలని తెలియదని చెప్పారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹100	₹170	₹180

సిరి వరించాలంటే..

- జాగ్రత్తలు పాటిస్తేనే సాధ్యం
- పండని పంట కోస్తే నష్టమే
- అతిగా ఎండకాసినా ఆదాయం శూన్యమే
- జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా వరికోతలు
- పలుచోట్ల నూర్పులు
- సేకరించిన ధాన్యాన్ని భద్రపరుస్తున్న రైతులు
- గిట్టుబాటు రావాలంటే జాగ్రత్తలు ఉండాలి



బొద్దవలస వద్ద ధాన్యం నూర్పును పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

రాజాం: జిల్లాలో ఖరీఫ్ వరికోతలు జోరుగు సాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నూర్పులు చేపడుతున్నారు. తుఫాన్ సూచనలు ఉండడంతో ముందుగా ధాన్యాన్ని ఇంటికి తరలించి భద్రపర్చాలని కొంత మంది, కొనుగోలు కేంద్రాలకు తరలించి సొమ్ము చేసుకోవాలని మరికొంతమంది అన్నదాతలు ఆశపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో విధిగా యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచిదని, కష్టానికి తగిన ఆదాయం రావాలంటే జాగ్రత్తలు తీసుకోక తప్పదని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. వరి సాగుతో పాటు పంటకోత, నూర్పిడి, ఒబ్బిడిలోనూ మెలకువలు పాటించినప్పుడే దిగుబడులు పెరుగుతాయని వ్యవసాయ శాఖ రాజాం ఏడీఏ కె.చంద్రరావు వెల్లడించారు. ప్రధానంగా రైతులకు అందుబాటులో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్‌ల వద్ద సలహాలు తీసుకోవాలని సూచిస్తున్నారు.



రేగిడిలో వరికుప్పలు పెట్టే విధానంపై అవగాహన కల్పిస్తున్న వీఏఏ

ఇలా చేయాలి..

వరి కుంకుల్లో 80 నుంచి 90 శాతం గింజలు పసుపు రంగులోకి మారుతున్నప్పుడే పంటను కోయాలి. ఈ దశలో ధాన్యం గింజల్లో 18 నుంచి 24 వరకూ తేమ శాతం ఉంటుంది. పూర్తిగా ఎండిపోయే వరకూ వరి పంట కోయకుండా వదిలేస్తే రెక్క రాలడం వల్ల గింజ దిగుబడి తగ్గిపోతుంది. ధాన్యం గింజలపై పగుళ్లు వస్తాయి. పగిలిన ధాన్యాన్ని మిల్లులో ఆడించేటప్పుడు బియ్యం శాతం తగ్గి నూకల శాతం ఎక్కువ ఉంటుంది. వరి పంటను కోసిన తరువాత తేమ శాతాన్ని తగ్గించడానికి వరి పనలను 4 నుంచి 5 రోజులు పంటభూమిలోనే ఆరనివ్వాలి. కోసిన వరి పనలను కిందికి, మీదకు తిరగబెడితే సమానంగా ఎండుతుంది. వరి పనలు కోసిన తరువాత వర్షం కురిస్తే ఐదు శాతం ఉప్పును పనలపై జల్లితే ధాన్యం రంగు మారదు. వరి పంట పూతకొచ్చిన తరువాత 30 రోజుల్లో కోత దశకు చేరుకుంటుంది. పంట పూర్తిగా పండకుండా కోత కోస్తే ధాన్యంలో పచ్చి గింజలు ఎక్కువగా ఉంటాయి. వరి కంకిలోని చివర గింజలు పూర్తిగా తోడుకాకుండా ధాన్యం సన్నగా ఉండి పొట్ట తెలుపు రంగులో ఉంటాయి. దీని వల్ల ధాన్యం దిగుబడి తగ్గి నూక, తవుడు శాతం ఎక్కువగా ఉంటుంది. పండిన వరి పంటను యంత్రం ద్వారా నూర్చడం వల్ల మట్టిబెడ్డలు చెత్త, దుమ్ము వంటివి ధాన్యంలో ఉండవు. నూర్పు చేసిన ధాన్యాన్ని ఎక్కువగా ఎండ ఉన్నప్పుడు ఆరబెట్టకూడదు.తేమ తగ్గిపోయి మిల్లు ఆడించేటప్పుడు నూకలు ఎక్కువగా వస్తాయి.

జాగ్రత్తలు తప్పనిసరి..



ఆరుగాలం కష్టపడి వరిని పండించే రైతులు పంటకోత, కుప్పలు పెట్టడం, నూర్పు సమయంలో జాగ్రత్తలు పాటించాలి. పండిన వరి పంటను సకాలంలో కోయాలి. నూర్పు చేసే ధాన్యంలో 14 శాతం కన్నా తేమ తక్కువ ఉండేలా చూసుకోవాలి. ధాన్యాన్ని ఎక్కువ కాలం నిల్వ ఉంచరాదు. దగ్గర్లోని రైతు భరోసా కేంద్రాల్లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ల సలహాలు పాటించాలి.
– కె.చంద్రరావు, వ్యవసాయశాఖ ఎ.డి, రాజాం

ఈ మెలకువలు పాటించాలి

- ఒబ్బిడిగా నిల్వ చేయాలి.
- నూర్చిన ధాన్యాన్ని 14 శాతం కన్నా తక్కువగా తేమ ఉండేలా చూసుకోవాలి.
- ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉంటే ధాన్యం బూజు పట్టడం, రంగు మారడంతో పాటు కీటకాలు ఆశివస్తాయి.
- ఎక్కువ నిల్వ ఉంచాల్సి వస్తే కీటకాలు ఆశించకుండా పొగబెట్టాలి.
- ధాన్యాన్ని పొడి సంచుల్లో వేయడంతో పాటు గోడలు, నేలపై తేమ పీల్చకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి.
- ధాన్యం బస్తాలను 1 నుంచి రెండు అడుగుల ఎత్తులో వేస్తే భూమిపై ఉన్న తేమను లాక్కోవు.
- ఎలుకలు ఆశించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- ధాన్యాన్ని ఎక్కువ కాలం నిల్వ చేస్తే రంగు మారుతాయి.
- రైతులు సకాలంలో అమ్మడం లేదా మరపట్టించడం చేయాలి.
- రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి విక్రయాలకు సంబంధించి ట్రక్ షీట్ పొంది, సంబంధిత ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించాలి.

సస్యరక్షణతో తెగులు నివారణ

- ఉద్యానశాఖాధికారి పి.మోహనకృష్ణ
- సాక్షి కథనానికి స్పందన



పొట్టిచిక్కుడు పంటను పరిశీలించి తెగులు నివారణపై రైతులకు సూచనలు చేస్తున్న ఉద్యానశాఖాధికారి మోహనకృష్ణ

రామభద్రపురం: సస్యరక్షణ చర్యలతో కూరగాయల పంటల్లో తెగులు, చీడపురుగులను రైతులు నివారించుకోవచ్చునని రామభద్రపురం మండల ఉద్యానశాఖాధికారి పి.మోహనకృష్ణ సూచించారు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాల కారణంగా కూరగాయల పంటలకు తెగులు, పురుగు సోకి పంటలు పూర్తిగా పాడయ్యాయి.దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు పెట్టుబడులు కూడా రాక తీవ్ర నష్టాల పాలయ్యామని రైతులు వాపోతున్నారు. దీంతో 'ఇదేం చీడ బాబోయ్'..! శీర్షికతో ఈ నెల 11వ తేదీన సాక్షి కథనం ప్రచురించింది.ఈ కథనానికి స్పందించిన ఉద్యానశాఖాధికారి పి మోహనరావు, వీహెచ్‌ఏ హైమావతిలు సోమవారం మండలంలోని కూరగాయల పంటలను పరిశీలించారు. తుఫాన్ ప్రభావం వల్ల కూరగాయల పంటల్లో తెగులు, పురుగు బెడద, వైరస్ ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు.పొట్టి చిక్కుడులో మొజాయిక్ తెగులు, ఆకుల మీద లేద పసుపు మచ్చలు, తుప్పు తెగులు, బ్యాక్టీరియా తెగులును గుర్తించారు. అలాగే ఉల్లి తామర పురుగు, వంకాయలో కొమ్ము, కాయ తొలుచుపురుగు సోకినట్లు గుర్తించారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఇంకాఏమైనా సందేహాలుంటే గ్రామ ఉద్యాన సహాయకులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ ఎల్.హైమావతి, ఎస్ జ్యోతి, పి.కొండలరావులు పాల్గొన్నారు.

ఆర్‌టీసీ డ్రైవర్ ప్రతిభ



సంతకవిటి: పతకాలతో ఆర్‌టీసీ డ్రైవర్ ప్రసాద్

సంతకవిటి: తిరుపతిలో ఈ నెల 8 నుంచి 10 వరకు నిర్వహించిన 42వ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో సంతకవిటి మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ జరజాన ప్రసాద్ తన సత్తా చాటి పరుగు పందెం 4 x100 రిలే, హైజంప్‌లో గోల్డ్ మెడల్స్, లాంగ్‌జంప్‌లో రజతం, 100 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకాలను సాధించారు. ఆయన ప్రస్తుతం మన్యం జిల్లాలోని పాలకొండ ఆర్‌టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సహచర సిబ్బంది ఆయనను అభినందించారు.

జగనన్నకు చెబుదాంకు 198 వినతులు



అర్జీలను స్వీకరిస్తున్న జేసీ మయూర్ అశోక్



పార్వతీపురం: లబ్ధిదారుకు వినికిడి యంత్రాన్ని అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు



పార్వతీపురం టౌన్: అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్



బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం అర్బన్: విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ప్రజల నుంచి 198 వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీ అనిత, డిప్యూటీ కలెక్టర్‌లు డి.వెంకటేశ్వరరావు, బి.సుదర్శనదొర, కేఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ సుమబాల తదితర జిల్లా అధికారులు వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు వాటిని పరిష్కారం కోసం పంపించారు. ఆయా శాఖలకు అందిన వినతులను సకాలంలో అర్జీదారుల సంతృప్తిమేరకు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి ఈ సందర్భంగా ఆదేశించారు.

ఆడుదాం ఆంధ్ర రిజిస్ట్రేషన్లు వేగంగా చేయాలి

స్పందన కార్యక్రమం అనంతరం అధికారులతో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఉన్నందున మండల ప్రత్యేకాధికారులు వారికి ఇచ్చిన లక్ష్యాలను తప్పక నెరవేర్చాలని, రిజిస్ట్రేషన్ వేగం పెంచాలని సూచించారు. ఈ విషయంలో వలంటీర్ల సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. క్రీడలకు అవసరమైన మైదానాలను తయారుచేయాలన్నారు.

వినతులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలి

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీతో పాటు ఐటీడీఏ పీఓ సి. విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావులు ప్రజల నుంచి వ్యక్తిగత, సామాజిక అంశాలపై 126 అర్జీలను స్వీకరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మక్కువ మండలంలోని డి.శిర్లాం గ్రామానికి చెందిన చెల్లారపు నారాయణకు రూ.3,500లు విలువ కలిగిన వినికిడి యంత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావు, పౌరసరఫరాల అధికారి శివప్రసాద్, రవాణాశాఖాధికారి మల్లికార్జున రెడ్డి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వర న్యాయం

పార్వతీపురంటౌన్: ఫిర్యాదులపై సత్వర న్యాయం జరగాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేధింపులు, కుటుంబ కలహాలు, సివిల్ తగాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో ఎస్పీ మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ ఒ.దిలీప కిరణ్, ట్రైనీ డీఎస్పీ ఎస్.ఎం.డి అజీజ్, ఎస్పీ సీఐ, సీహెచ్ లక్ష్మణరావు, డీసీఆర్‌బీ సీఐ ఎన్.వి.ప్రభాకర్ రావు, ఎస్సై పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమాన్ని ఎస్పీ ఎం.దీపిక సోమవారం నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా ఎస్పీ 24 ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, ఏడు పనిదినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్, డీసీఆర్‌బీ ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థానికి పోటెత్తిన భక్తులు



శ్రీ సీతారామస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. కార్తీకమాసంలో ఆఖరి సోమవారం కావడంతో రామాలయంతో పాటు శివాలయంలో భక్తుల రద్దీ కనిపించింది. ఈ సందర్భంగా అర్చకులు భక్తులతో ప్రత్యేక పూజలు జరిపించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉమా సదాశివాలయంలో శివుడికి పంచామృత ద్రవ్యాలతో విశేష అభిషేకాలు జరిపించారు. సారిపల్లి, పారసాం, ఒమ్మి, సతివాడ, బూరాడపేట గ్రామాల్లో ఉన్న పురాతన శివాలయాలకు వేకువజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలి వెళ్లి స్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో దీపారాధన చేశారు.

అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా జట్టు పయనం



అథ్లెటిక్స్ పోటీలకు వెళ్తున్న జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్–19 స్కూల్ గేమ్స్ బాల, బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్టు సోమవారం పయనమైంది. ఈనెల 12 నుంచి 3 రోజుల పాటు గుంటూరు జిల్లా నరసారావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరగనున్న పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ మేరకు క్రీడాకారులకు అండర్–19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పీడీలు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు సత్తా

- ద్వితీయ స్థానంలో నిలిచిన క్రీడాకారులు



రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన బాల్ బ్యాడ్మింటన్ జిల్లా పురుషుల జట్టు

తెర్లాం: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లాకు చెందిన పురుషుల జట్టు సత్తా చాటింది. రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 8 నుంచి 10వరకు అనంతపురంలో జరగ్గా జిల్లా పురుషుల జట్టు రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. జిల్లా పురుషుల జట్టు రాష్ట్రస్థాయిలో రాణించడంతో బాల్ బ్యాడ్మింటన్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులతోపాటు, పలువురు పీడీలు, పీఈటీలు క్రీడాకారులను అభినందించారు. మరిన్ని పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా పురుషుల జట్టుకు కోచ్‌లుగా జి.సింహాచలం, టి.శ్రీనివాసరావు వ్యవహించారు.

జాతీయ స్థాయి పోటీలకు ముగ్గురి ఎంపిక

జనవరి 2024లో జరగనున్న జాతీయ స్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారని బాల్ బ్యాడ్మింటన్ కోచ్, నెమలాం హైస్కూల్ పీడీ జి.సింహాచలం సోమవారం తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను బాల్ బ్యాడ్మింటన్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, పీడీలు అభినందించారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు మన్యం విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

పార్వతీపురంటౌన్: జాతీయస్థాయి కరాటే పోటీలకు పార్వతీపురం మన్యం జిల్లా విద్యార్థి ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన తన కార్యాలయం వద్ద ఆ విద్యార్థిని అభినందించారు. పార్వతీపురం మండలం పెదమరికి ఎంపీయూపీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న హిమరికనాని కరాటే పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపించాడని ఢిల్లీలో జరగనున్న పోటీలకు అర్హత సాధించినట్లు డీఈఓ చెప్పారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ ఎస్.వెంకటేశ్వరరావు, కోచ్ ఎస్. నాగేశ్వరరావు, చీఫ్ కోచ్ బి.గోపాల్, జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీ గాంధీ, సిబ్బంది పాల్గొన్నారు.

గోస్తనీలో పడి విద్యార్థి మృతి



హరి మృతదేహం

రామభద్రపురం: మండలంలోని రొంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి విశాఖ జిల్లా పద్మనాభం మండలంలోని గోస్తనీ నదిలో పడిపోయి మృతి చెందాడు. ఈ ప్రమాదంపై కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రొంపల్లి గ్రామానికి చెందిన పొన్నగంటి అప్పారావు ఏడేళ్ల క్రితం జీవనోపాధి కోసం కుటుంబసభ్యులతో కలిసి విశాఖపట్నం వెళ్లిపోయి పెయింటింగ్‌లు వేసుకుంటూ కుటుంబ పోషణ సాగిస్తున్నాడు. ఆయన చిన్న కుమారుడు హరి(16)ఇంటర్మీడియట్ అక్కడే చదువుతున్నాడు. ఆదివారం కొంతమంది స్నేహితులతో కలిసి పిక్నిక్ కోసం పద్మనాభం మండలంలోని పాండ్రంగి కురవల్లి వద్ద ఉన్న గోస్తనీనది వద్దకు వెళ్లాడు. నది దగ్గర చెక్ డ్యాం మీదకు వెళ్లి ముగ్గురు స్నేహితులతో కలిసి ఫొటోలు తీసుకుంటుండగా ప్రమాదవశాత్తు ముగ్గురూ నదిలో పడిపోయారు. వారిలో హరి గల్లంతయ్యాడు. మిగిలిన ఇద్దరు స్నేహితులు ఒడ్డుకు చేరుకుని హరి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈతగాళ్లు గాలించినా అచూకీ దొరకలేదు.సోమవారం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చేపట్టగా నదిలో మృతదేహం తేలింది.

భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు

బొబ్బిలి: భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న భర్తకు ఏడాది జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎం.సరోజనమ్మ సోమవారం తీర్పు వెల్లడించారు. బొబ్బిలి పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని మెహర్‌కాలనీకి చెందిన టీచర్ గర్భాపు భవానీ తన భర్త తనను కొన్నాళ్లుగా వేధిస్తున్నాడని 2020 సెప్టెంబర్ 14వ తేదీ బొబ్బిలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐ వెలమల ప్రసాదరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం చార్జిషీటు కోర్టులో దాఖలు చేశారు. ఈ కేసుపై సోమవారం తుది విచారణ జరగ్గా ముద్దాయి చంద్రశేఖర్‌కు ఏడాది జైలుశిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించారు.